
కథ

# గాలి బుడగ

చంద్రలత





"మంగళ్ ఆ బెలూన్‌వాలా వస్తే నేరుగా ఇక్కడికి తీసుకు రా!" సునీల్ బాల్కనీ లోంచి కేకేసాడు.

"జీ సాబ్ ....!" బదులుగా అరిచాడు గుర్ఖా.

సునీల్ వెనక్కు తిరిగి అక్కడే వేసివున్న గార్డెన్ ఛెయిర్ లో కూర్చున్నాడు.

తన రూఫ్‌గార్డెన్ వంక తృప్తిగా చూసుకున్నాడు. బెంగుళూరు నుంచి నిపుణుల్ని తెప్పించి వేయించాడు. ఎప్పుడైనా వీలుదొరికినపుడు తనే స్వయంగా లాన్‌కి నీళ్ళు పెడుతూ వుంటాడు. బెడ్‌రూంలోంచి తిన్నగా లాన్‌లోకే రావచ్చు. ముందు వైపు నుంచి ఇంకో దారి వుంది. మంగళ్ ఆ బెలూన్లబ్బాయిని ఇటే తీసుకువస్తాడు.

సునీల్ తన కుర్చీని మెట్లకి తిన్నగా జరుపుకున్నాడు.

తను ఇంత ఉత్సాహంగా ఎవరికోసం ఎదురుచూసిన జ్ఞాపకం లేదు.

అవన్నీ మొక్కుబడి ధర్మాలు. పైపైని వ్యవహారాలు.

నిజానికి తనని కలవడానికి వచ్చేవాళ్ళు సామాన్యులు కారు. కలవడం సులభం కాదు. వాళ్ళల్లో ఎవరితో పోల్చడానికి కూడా బెలూన్లబ్బాయి ఊహమాత్రం పనికిరాడు. కానీ, ఎందుకో.....వాళ్ళెవరినీ కలిసినపుడు కలగని అనుభూతేదో ఉద్వేగమేదో అతన్ని కలవాలన్నపుడు కలుగుతోంది.

వాళ్ళందరూ తనను కలవడానికి వచ్చేది ఏదో అవసరం మీద. తను వాళ్ళను కలవడానికి వెళ్ళేది అవసరం మీదే. ఆ అవసరం సాకారం చేసుకోవడానికి పరస్పరం పడే ప్రయాస, చేసుకొనే వాగ్దానాలు, చూపించే ప్రలోభాలు.......!

అందరం చేసేది ఒకే రకం పని - వ్యాపారం.

ఒకరిని మించి ఒకరు, ఒకరిని దాటి ఒకరు అనుక్షణం అలుపు అనుకోకుండా చేసే పరుగు పందెం.

ఒకరిని మించలేక పోయినా మించి పోయేవాడికి కాలు అడ్డం పెట్టగల నేర్పే ఆ పందెపు అర్హత. ఓ విధమైన మొండిబతుకు.

అనుకోకుండా తమలో మార్పు వచ్చింది. అదీ అగర్వాల్ కుటుంబం వలన.

దేశ విదేశాలన్నీ చుట్టి వచ్చిన వారు చివరికి తమ కాలనీలోకి వచ్చి స్థిరపడ్డారు. వారిదీ తమ జాతే -- వ్యాపారం.

ధనూ ఆంటీ - మిసెస్ అగర్వాల్ - తమ క్లబ్ వాతావరణాన్నే మార్చేసింది. అంతకు ముందు చీరల పెళపెళలు, గ్లాసుల గలగలలు తప్ప చెప్పుకోదగ్గ అంశాలేం వుండేవే కావు.

రాజెల్‌డాజెల్ షోలు, క్యాట్‌వాక్‌లు, ర్యాంప్‌వాక్‌లతో తమ క్లబ్ ఇప్పుడు కళకళలాడి పోతోంది.

ఇంతలో గూర్ఖా మెట్లెక్కి రావడం కనిపించింది. సునీల్ ఉద్వేగాన్ని అణుచుకొంటూ నెమ్మదిగా లేచి ఎదురెళ్ళాడు. సునిల్ చేతిలో ఓ కవరు పెట్టి వెళ్ళాడు గూర్ఖా - ఎవరో ఇచ్చివెళ్ళారంటూ.

సునీల్ కవరులో వున్న ఫొటోలను టీపాయి మీద వరుసగా పరిచాడు.

ఆ ఫొటోల నిండా తనే!

ఓ ఫొటోలో కలెక్టర్ తనను అభినందిస్తూంటే మరోదాంట్లో ధనూ ఆంటీ మెటికలు విరుస్తోంది. ఇంకో దాంట్లో - మిస్ సోనికా తన వంక ఓర చూపులు చూస్తుంటే మిస్ మోనికా ఆవిడ్ని చురచురా చూస్తోంది.

ట్రైయాంగిల్ యాక్షన్ రీప్లే!

సునీల్‌కి నవ్వొచ్చింది. ఒక్కోసారి ఫొటోలు ఊహించని అంశాలను దృష్టికి తెస్తాయి.

సునీల్ ఆ ఫొటోను చేతిలోకి తీసుకొని, కుర్చీలో వెనక్కు వాలి కూర్చున్నాడు. మిస్-లిద్దర్నీ నిశితంగా పరిశీలించాడు.

మిస్ సోనికా ఏం గమ్మత్తు చేసిందో కానీ తన అల్చిప్పల్లాంటి కళ్ళని చిన్న చిన్న బాదం కాయల ఆకారంలోకి మార్చేసింది. గైషా వేషం వేసింది.

మిస్ మోనికా తన పొడవాటి జుట్టును కత్తిరించేసింది. లేడీడయానా గెటప్‌లో వచ్చింది.

ఒకరిని మించి ఒకరు!

మిస్ సోనికా మద్రాస్ నుంచి బ్యూటీషియన్‌ను పిలిపించిందని వినికిడి.

మిస్ మోనికా తన దుస్తులను బొంబాయి నుంచి తెప్పించిందట.

వాళ్ళిద్దరనే కాదు క్లబ్ మెంబర్లంతా అసలు స్వరూపాలేవో తెలియకుండా మారిపోయారు. అసలు ధనూ ఆంటీ సంగతి చెప్పనే చెప్పక్కరలేదు. గుజరాతీ డ్రస్‌లో చిన్న పిల్లలా చకచకా తిరుగుతూ, అందర్నీ ఇట్టే ఆకట్టుకుంది.

ఎప్పుడూ ఆ సోనికానో మోనికానో తప్పించి మరొకరు గెలవడమే లేదు. ఈ సారి కూడా అదే జరుగుతుందనుకొన్నారు అందరూ. అయినా ఎన్నాళ్ళు సాగుతుందీ ఏకచ్ఛత్రాధిపత్యం!

అసలు తమాషా ధనూ అంటీ ఆది వారం ఫ్యాన్సీ డ్రస్ పోటీలో తననూ పాల్గొన మని అడగడంతో మొదలయింది.

ఎప్పుడూ ఓ పక్కగా - వీటన్నిటినీ పట్టించు కోనట్లు వుండే మొద్దబ్బాయి తను! ఏ తంబోలా ఆడేప్పుడో ఏ అంత్యాక్షరి ఆడేప్పుడో తప్పించి - వాళ్ళ జోలికి కూడా వెళ్ళకుండా ఓ పక్కగా కూర్చునేవాడు. మొత్తం క్లబ్బులో మంచి అబ్బాయి అన్నపేరు వుంది తనకి.

ధనూ ఆంటీ తనని కూడా పోటీలో పాల్గొనమనగానే - పక్కనే వున్న మిస్ మోనికా అంది. బుద్ధదేవుడి వేషమైతే నీకు సరిపోతుంది అని.

మిస్ సోనికా వెంటనే అందుకొని - వివేకానందుడైనా ఫర్వాలేదు ! అంటూ సర్టిఫికెట్ ఇచ్చింది.

అందరూ విరగబడి నవ్వారు - అవేవో నవ్వొచ్చే మాటలన్నట్లుగా! ఆ రోజంతా తనను వేళాకోళాలాడారు.

తను ఉక్రోషంతో అపుడే నిర్ణయించు కొన్నాడు - వాళ్ళందరి నోరు మూయించా లంటే వాళ్ళెవరూ ఊహించని తీరులో వాళ్ళని ఓడించాలి. కానీ ఎలా? మిస్ సోనికా అన్నయ్య మైకెల్‌జాక్సన్ వేషం వేస్తున్నాడట. మిస్ మోనికా తమ్ముడు ఖల్ నాయక్ వేషంట. తన స్నేహితులు ఏవేవో పుస్తకాలు తెచ్చిచ్చారు.

మగవాళ్ళు మేకప్‌లలో, గెటప్‌లలో అన్ని వైవిధ్యాలుంటాయనీ, అన్ని విచిత్రా లుంటాయనీ తనకి మొదటి సారి తెలిసింది.


ఇదిలా వుండగా .... మిస్ సోనికా ఫోన్ చేసింది..... మోనికా ఏం వేషం వేయ బోతోందో ఆరా తీయమని. కాసేపటికి మిస్ మోనికా ఫోన్ వచ్చింది - అదే అభ్యర్థనతో. ఒకళ్ళు స్విస్‌వాచ్ బహుమతిగా ఇస్తామంటే.... ఇంకోళ్ళు ఏకంగా బంగారు బ్రాస్‌లెట్ ఇస్తామన్నారు. ఇది చాలు పోటీ ఎంత ప్రతిష్ఠాత్మకంగా తయారయిందో ఊహించడానికి.

తను చివరిదాకా ఇద్దరినీ మభ్య పెడుతూ వచ్చాడు. పాపం! అసలు అపాయం తననుంచేనని ఊహించి వుండరు.

అసలు తాను వేయవలసిన వేషం చాలా తమాషాగా నిర్ధారణ అయ్యింది.

ఆ రోజు తన మేనల్లుడి పుట్టినరోజు.

పెళ్ళయిన కొత్తలో మా ఆవిడ తలనెప్పంటే వంట చేసా.. ఆరోజు నుంచీ మా ఆవిడకు తలనెప్పి తగ్గితే ఒట్టు...



వాడికోసం పుట్టినరోజు బహుమతిని ఎంపిక చేయడం అంత తేలికైన విషయమేమీ కాదు. ఎందుకంటే - వాడి దగ్గర ఈ ఆకాశం కింద పిల్లలకోసం సృష్టించబడిన అన్ని రకాల ఆటవస్తువులు, అనేకరకాల దుస్తులు వున్నాయి. పిల్లల పుస్తకాలయితే లెక్కేలేదు. అంతలో తనకు చటుక్కున జ్ఞాపకం వచ్చింది.

తన చిన్నతనంలో తనకు తీరకుండా మిగిలి పోయిన ఓ చిన్నకోరిక. గాలికి సుతారంగా కదిలిపోయే రంగు రంగుల గాలి బుడగలని వెంబడించి స్వంతం చేసుకోవాలనే కోరిక.

తన స్నేహితులకు చాలామందికి ఆట వస్తువులు కేవలం అవే! వాళ్ళసలు వాటి ప్రత్యేకతను పట్టించుకొనే వారే కారు.

నాన్న వాటికి కానీ, వాటిని అమ్మే మనుషులను కానీ దగ్గరికి రానిచ్చేవాడే కాదు. ఆ మురికి వాళ్ళ మురికి ఆటల ఊసే సహించేవాడు కాడు. మురికిలో దొర్లి పొర్లి సంబరపడే వయసొకటి వుంటుందని ఆయనెప్పుడు గుర్తించలేదు. అదే వారసత్వం అక్కడి గూడా!

తను ఆరోజు తన మేనల్లుడికి ఆ మురికి వేళ్ళు బెల్లూన్లలోకి గాలి ఊది - సృష్టించే అద్భుతాల్ని చూపించాలని కృత నిశ్చయానికి వచ్చాడు.

నిజానికి వాడి పుట్టినరోజు అలంకరణతో అవీ భాగమే. కానీ వాటికి ముట్టు కోవడానికి కూడా వీల్లేదు. అక్కగారి ఆజ్ఞ!

అదేంటోకానీ ఆ రోజు ఊరంతా గాలించినా ఒక్క బుడగలబ్బాయి కనిపించలేదు. చీకటిపడే సమయానికి ఆపద్బాంధవుడిలా ఇతను తమ వీధిలోకే నడిచి వచ్చాడు. నీరసంగా కాళ్ళీడ్చు కొంటూ - బుడగలు కట్టిన కర్రను మోయలేక మోస్తున్నట్లు మోస్తూ వచ్చాడు.

తను పరుగు పరుగున ఎదురెళ్ళాడు.

తనకు సంతృప్తికరంగా - అతని సంచిలోని బుడగలు విభిన్న ఆకారాల్లోకి మారిపోయాయి. చిన్న వెదురు బొంగుల గాలి పంపుతో అతను అద్భుతాల్నే సృష్టించాడు.

రకరకాల జంతువుల - పక్షుల బొమ్మలు, గిలక్కాయలు, పూలహారాలు వగైరాలు, తను ఆనందంతో చేతికందినన్ని నోట్లను తీసి అతని చేతిలో కుక్కి, వేగంగా మేనల్లుడి దగ్గరకి వెళ్ళాడు. కోతిబొమ్మను అందుకున్న వాడి చిన్ని కళ్ళల్లో మెరిసిన మెరుపులు నాన్న చూసివుంటే ఎంత బావుండేదో!

ఆ మర్నాడు ఒక్కసారి బెలూన్లబ్బాయి మళ్ళీ వచ్చాడు.

వాళ్ళంతే ఒక్కసారి చనువిస్తే వదిలి పోరు! అన్నాడు విషయం తెలిసిన వంట మనిషి. తనకి ఓ ఆలోచన తట్టింది. అతనిని లోపలికి తీసుకురమ్మని వంటమనిషిని పంపాడు. తను గబగబ లోపలికి వెళ్ళి, ఆటోమాటిక్ వీడియోకెమెరాను తీసుకొచ్చి తన వెనకగా అమర్చి వచ్చాడు. ఏమీ ఎరగనట్లు నింపాదిగా బేరమాడి, కొన్ని బడుగలను కొన్నాడు. ఆ బుడగలబ్బాయి సంతోషంగా వెళ్ళిపోయాడు.

ఈ లోపల కెమెరా తన పని తను నిశ్శ

బ్ధంగా చేసుకు పోయింది.

క్షణాల్లో తమ ఊళ్ళోనే ఖరీదైన దర్జీ, మేకప్‌మాన్, హెయిర్ స్టైలిస్ట్ తన ముందున్నారు. అందరూ కలిసి ఆ వీడియోను అంగుళం వదలకుండా ఆకళింపు చేసుకొన్నారు. ఆ బుడగలబ్బాయిని నగశిఖ పర్యంతరం - అన్ని కోణాల్లోనూ - పరిశీలించేసారు. అతుకు బొతుకుల దుస్తుల్నీ, మాసిపోయిన తలనీ, గడ్డాన్నీ, ముక్కు చివరనున్న పులిపిరినీ, తాయెత్తులనూ, పచ్చబొట్లను....అన్నిటినీ నకలు చేసేసారు.

చివరికి తను బుడగలవాడి అవతారం ఎత్తాడు.

ఆ రోజటి పోటీలో విజేతనని తనేనని వేరే చెప్పాలా?

భాస్కర్‌ప్యాలెస్ రిసెప్షన్ హాల్లోకి ఇలాంటి మురికి వ్యక్తి కాంటెస్సా కారు వేసుకొని రావడం అంటే - అద్భుతమే కదూ మరి!

అందరూ ఆశ్చర్యం లోంచి తేరుకొని, తనకు మెటికలు విరిచారు. ఒక్కో బెలూన్‌ను అందుకొని ఓ పెద్దనోటును తనకందించారు. నోట్లమీది గాంధీతాత బోసినవ్వులతో తన మురికిజేబులోకి ఒదిగిపోయాడు. మిసెస్ - మిస్‌లిద్దరూ కొరకొరా చూస్తుంటే - ధనూ ఆంటీ ముసి ముసి నవ్వులతో తనను ముంచెత్తింది.

సోనికా మోనికా తెల్లమొహాలేయడం - ధనూ ఆంటీ మురిపెంగా మెటికలు విరవడం అంతా ఇప్పుడు జరుగుతున్నట్లుగా వుంది.

ఈ విజయానికి, ఈ సంబరానికి మూలమైన బెలూన్లబ్బాయి కొద్ది సేపట్లో ఇక్కడికి రాబోతున్నాడు. తను అతన్ని నోట్లతో ముంచెత్తాలనుకొంటున్నాడు.

అవును మరి! తక్కువ ఖర్చుతో అతి పెద్ద లాభం. అందరి అభిమానం అదనం ! పేరు ప్రతిష్టలు అదనం!

ఎవరో చిన్నగా దగ్గినట్లుగా అనిపించి, ఆలోచనల్లోంచి ఒక్కసారిగా బయట పడ్డాడు సునీల్.

ఎదురుగా పాతేసిన గుంజలా - బుడగలబ్బాయి.

సునీల్ సంబరంగా పలకరించబోయాడు.

ఎందుకోగానీ, అతను ఇంతకు మునుపులా కనిపించలేదు సునీల్‌కు.

అతని పదునుచూపులు పడుతున్న వైపు దృష్టి సారించాడు.

అతను తీక్షణంగా టీపాయి మీద పరిచివున్న ఫొటోల వంక చూస్తున్నాడు.

సునీల్ సంతోషంగా విషయం వివరిద్దామని నోరు తెరవబోయాడు. ఆ లోపలే అతను అన్నాడు.

"చాలా సంతోషం సార్! మీ మధ్య మాకూ చోటిచ్చారు!"

అతని కంఠంలో నిజంగానే సంతోషం వుందో, వెటకారం వుందో సునీల్ బుర్రకి తట్టనే లేదు. అప్రయత్నంగా పర్సు తెరిచి, డబ్బు చేతిలోకి తీసుకొన్నాడు.

ఏ భావమూ తొణకని గొంతుతో అతనన్నాడు, "సార్! నన్ను అనుకరించి నందుకు మూల్యం చెల్లిస్తు న్నారేమో కానీ, నా స్థితిని అపహాస్యం చేసి ప్రదర్శన చేసి అవమానించిన మీ అహంభావానికి మూల్యం చెల్లించగలరా?"

నివ్వెర పోయిన సునీల్ తేరుకొనే లోపలే - అతనక్కడి నుంచి వెళ్ళి పోయాడు.

గబగబ పరిగెత్తి బాల్కనీ లోంచి తేరిపార జూసిన సునీల్‌కి - విలాసంగా కదులుతోన్న రంగురంగుల గాలి బుడగలు క్రమంగా దూరమవుతూ కనిపించాయి.

తన అంతరాంతరాల్లో ఒదిగి వున్న గాలి బుడగలేవో గాలిలో కలిసి పోయినట్లనిపించింది సునీల్‌కి. ●

